ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 24 సెప్టెంబరు 2024



తల్లీబిడ్డల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి: జేసీ

కలెక్టరేట్, సెప్టెంబరు 23: తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని జేసీ సేతు మాధవన్ సూచించారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రధానంగా అమ్మపేరుతో మొక్కను నాటే కార్యక్రమంలో భాగంగా సుమారు 13 వేలు మొక్కలు నాటడం విశేషమన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని, అమ్మఒడి నుంచి అంగన్‌వాడీకి వెళ్తున్న బిడ్డను అమ్మలాగే చూసుకోవాలన్నారు.

పెను విషాదం



విలపిస్తున్న సౌమ్య తల్లిని ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు



సౌమ్య(ఫైల్)

- జలపాతంలో కొట్టుకుపోయి ఇద్దరు వైద్య విద్యార్థినుల మృతి
- అల్లూరి జిల్లా మారేడుమిల్లి వద్ద ఘటన
- ఒకరిది బొబ్బిలి.. మరొకరిది బాడంగి
- స్వగ్రామాలకు చేరిన మృతదేహాలు

బొబ్బిలి/ బాడంగి, సెప్టెంబరు 23:
మరో రెండేళ్లలో కుమార్తె డాక్టర్ కోర్సు పూర్తి చేసి వస్తుందని, డాక్టర్‌గా చూస్తామని ఆ తల్లిదండ్రులు ఎన్నో కలలు కన్నారు. కుమార్తె చదువు కోసం ఎంత ఖర్చు అయినా పరవాలేదనుకున్నారు. డాక్టర్ చదువుతోందని బంధువులు, స్నేహితులకు గర్వంగా చెప్పుకుంటూ వస్తు న్నారు. ఆ కలల్లోనే ఉన్న వారికి కోలుకోలేని కష్టం వచ్చింది. తమ గారాల పట్టి ఇక లేదని వారి చెవిన పడింది. ఉన్నచోటే కూలిపోయిన వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. వారిని చూసిన ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు. బొబ్బిలి పట్టణం రావువారివీధికి చెందిన కొసిరెడ్డి సౌమ్య(21) ఇంట నెలకొన్న విషాదమిది. బాడంగి మండలం డొంకినవలస రైల్వేస్టేషన్‌కు చెందిన బాలి అమృత (22) కుటుంబానికి ఇదే పరిస్థితి. వీరిద్దరూ తోటి విద్యార్థులతో కలిసి అల్లూరి జిల్లా మారేడుమిల్లి జలపాతానికి వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు గల్లంతై చివరకు అచేతనంగా కంట పడ్డారు.

బొబ్బిలికి చెందిన కొసిరెడ్డి అప్పలనాయుడు, రమాదేవికి ముగ్గురు పిల్లలు. అప్పలనాయుడు తాపీమేస్త్రీగా ఉంటూ ముగ్గురినీ చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె జ్యోత్స్న, కుమారుడు సాయి, రెండో కుమార్తె సౌమ్య ఏలూరు ఆశ్రమ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువు తోంది. సౌమ్య 13 మంది తోటి విద్యార్థులతో కలిసి ఇటీవల విహారయాత్రకు వెళ్లింది. అల్లూరిసీతారా మరాజు జిల్లా మారేడుమిల్లి జలతరంగిణి జలపాతంలో ఉండగా ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతైంది. విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులు బొబ్బిలి నుంచి బయలుదేరి వెళ్లారు. సోమవారం వేకువజామున సౌమ్య మృతదేహం కంటపడింది. అంతవరకు సౌమ్యకు ఏమీ కాదని, మృత్యుంజయురాలై క్షేమంగా ఇంటికి చేరుకుంటుందని కొండంత ఆశతో ఉన్న కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

డొంకినవలసలోనూ విషాదం

బాడంగి మండలం డొంకినవలస రైల్వేస్టేషన్‌కు చెందిన బాలి అమృత (22) కూడా ఈ ప్రమాదంలో కన్నుమూసింది. ఏలూరు ఆశ్రమ మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న అమృత వరదప్రవాహంలో కొట్టుకుపోయి దుర్మరణం చెందింది. ఈమె తండ్రి బాలి శ్రీనివాసరావు రైల్వేలో గ్యాంగ్‌మేస్త్రీగా ఉన్నారు. ఈయన కుమారుడు అఖిల్ డిగ్రీ పూర్తిచేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. అమృత తోటి వైద్య విద్యార్థులతో కలిసి మారేడుమిల్లి జలతరంగణికి వెళ్లింది. అక్కడ అనుకోని రీతిలో వచ్చిన వరద ప్రవాహంలో కొట్టుకుపోయి విగత జీవిగా మారింది. ఆదివారం ఈ ప్రమాదం జరగ్గా సోమవారం ఉదయం అచేతనంగా కంటపడింది. తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రితో పనిచేసే రైల్వే ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో వచ్చి ఓదార్చుతున్నారు.

ఇళ్లకు చేరిన మృతదేహాలు

వైద్య విద్యార్థినుల మృతదేహాలు వారి స్వగృహాలకు సోమవారం రాత్రి చేరుకున్నాయి. అచేతన స్థితిని వారిని చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి. 20 ఏళ్ల వయస్సు వచ్చి, డాక్టర్ కోర్సు చదువుతున్నా ఇప్పటికీ ఇంటికొస్తే నా చిట్టి తల్లి నా గుండెలపైనే నిద్రపోతుందని అంటూ కొసిరెడ్డి అప్పలనాయుడు గుండెలు బాదుకుంటూ కన్నీరుమున్నీరుగా రోదిస్తున్న తీరు అందరినీ తీవ్రంగా కలచివేసింది. ప్రతిరోజూ రాత్రి సౌమ్య నుంచి ఫోన్ కాల్ వచ్చిన తరువాతే అందరం కలిసి భోజనం చేసేవారమని ఆమె తల్లి రమాదేవి రోదిస్తుంటే స్థానికులు చలించిపోయారు.



బాడంగి మండలం డొంకినవలస (ఆర్ఎస్)లో రోదిస్తున్న అమృత బంధువులు, ఇన్‌సెట్ అమృత(ఫైల్)

బదిలీల హడావిడి



విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 23: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో బదిలీ పర్వం కొనసాగుతోంది. సోమవారం పలువురు అధికారులకు స్థానచలనం కలిగింది.. బదిలీ అయిన వారి స్థానంలో కొత్తవారిని కూడా నియమించారు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగు విభాగానికి సంబంధించి అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) సీహెచ్ మధుసూధనరావును గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఏసీపీగా బదిలీ చేశారు. ఈయన స్థానంలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న హరిబాబును ఇక్కడకు బదిలీ చేశారు. మరో ఏసీపీగా వున్న అమ్మాజీరావును వీఎంఆర్‌డీఏ ఏపీవోగా బదిలీ చేశారు. ఈయన స్థానంలో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏసీపీగా వున్న రమణమూర్తిని విజయనగరం నగరపాలక సంస్థ ఏసీపీగా నియమించారు. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ పి.ఫిలిప్‌ని బొబ్బిలి మున్సిపాలిటీ టీపీఎస్‌గా నియమించారు. ఈయన స్థానంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న అనితను విజయనగరం టీపీఎస్‌గా నియమించారు. పలాస, కాశీబుగ్గలో పనిచేస్తున్న టీపీవో ఎస్.అప్పలరాజుని కూడా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ టీపీఓగా నియమించారు. ఇక్కడ టీపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న కె.మహబూబ్ జాన్‌ని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఈఈ కె.శ్రీనివాస్‌ను విశాఖ గ్రేటర్ మున్సిపాలిటీలో డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు. ఈయన స్థానంలో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈఈగా వున్న రాయల్‌బాబుని ఇక్కడకు బదిలీ చేశారు. వీరంతా రానున్న రెండు లేదా మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. నగరపాలక సంస్థలో మరిన్ని విభాగాలకు సంబంధించి బదిలీల ప్రక్రియ మంగళవారం కూడా కొనసాగనుంది.

బుడా ఏవో బదిలీ

బొబ్బిలి: బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఏవో చెక్కా సత్యనారాయణకు సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయింది. ఆయన స్థానంలో ఇంకెవరినీ నియమించలేదు. బొబ్బిలి మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న ఓ.వరప్రసాద్‌కు విశాఖ జీవీఎంసికి బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడి నుంచి ఎస్.రేవతి టీపీవోగా బదిలీపై రానున్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలోనూ బదిలీలు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 23: జిల్లాలో రిజిస్ట్రేషన్‌శాఖలో బదిలీలు ఆదివారం రాత్రి ముగిశాయి.. విశాఖపట్నంలోని నోడల్ డీఐజీ జి.బాలకృష్ణ సబ్‌రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్‌లకు కౌన్సెలింగు ద్వారా బదిలీలు నిర్వహించారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరినీ జోన్ పరిధిలో మార్చారు. 12 మంది సబ్ రిజిస్ట్రార్‌లు, 23 మంది సీనియర్ అసిస్టెంట్‌ల బదిలీల తంతును నోడల్ డీఐజీ చేపట్టగా, 24 మంది జూనియర్ అసిస్టెంట్‌లు, ముగ్గురు షరాబులు, 17 మంది ఆఫీస్ సబార్డినేటర్లను జిల్లా రిజిస్ట్రార్ ఏవీ కుమారి కౌన్సెలింగు ద్వారా బదిలీ చేశారు.

అంతా రహస్యమే

కలెక్టరేట్, సెప్టెంబరు 23: రెవెన్యూ శాఖలో బదిలీలపై అంతా రహస్యమే నడిచింది. జిల్లా వ్యాప్తంగా బదిలీల కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు? ఎంతమందిని బదిలీ చేశారు? అనే విషయాలను ఉన్నతాధికారులు వెల్లడించకపోవడం కలెక్టరేట్‌లో చర్చనీయాంశమైంది. బదిలీల వ్యవహారం మొదటి నుంచి చివరి వరకూ గోప్యంగా ఉంచడంతో కొందరు ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. బదిలీలు ప్రక్రియ ముగిసినా బదిలీ అయిన వారికి సోమవారం రాత్రి 9 గంటల వరకూ ఆర్డర్లు ఇవ్వలేదు. ఉన్నతాధికారులు ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారు? అనేది అర్థం కావడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. గతంలో మాదిరిగా ఈసారి కూడా ప్రభుత్వం బదిలీలకు ఇచ్చిన గడువు ముగిసిన తరువాత వెనుక తేదీ వేసి ఆర్డర్లు ఇస్తారా? అంటూ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

నిరుద్యోగుల ఆందోళన

- కానిస్టేబుల్ ఈవెంట్స్, మొయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్

కలెక్టరేట్, సెప్టెంబరు 23: కానిస్టేబుల్ క్వాలిఫై అయిన వారికి ఈవెంట్స్, మొయిన్ ఎగ్జామ్ నిర్వహించాలంటూ పలువురు నిరుద్యోగులు డిమాండ్ చేశారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిరుద్యోగులు సోమవారం కోట నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ గేటు వద్ద బైఠాయించి రహదారిపై వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. నిరసనలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుఎస్ఎన్ రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం కాని, ఈ ప్రభుత్వం కాని కోర్టులో ఉన్న కేసుపై ఒక్క విచారణకూ హాజరవ్వకుండా కానిస్టేబుల్ అభ్యర్థులు, హోంగార్డుల మధ్య తగాదాగా మార్చేశారని ఆరోపించారు. సంఘం జిల్లా కన్వీనర్ సీహెచ్ హరీష్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల్లో ఈ ప్రక్రియని పూర్తి చేస్తామన్నారని, ఇప్పటి వరకూ అమలు కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టులో ఉన్న సమస్యను పరిష్కరించి కానిస్టేబుల్ క్వాలిఫై అయినా వారికి వెంటనే ఈవెంట్స్ , మొయిన్ ఎగ్జామ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు గణేష్, సతీష్ తదితరులు ఉన్నారు.



బస్సులను అడ్డుకుంటున్న నిరుద్యోగులు

ఆపన్నులకు అండ

- సీఎంకు రూ.50 లక్షల చెక్కు అందజేత

రాజాం రూరల్, సెప్టెంబరు 23: తుఫాన్‌తో సర్వం కోల్పోయిన విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పందించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. విరాళాల సేకరణకు నడుం బిగించారు. సేకరించిన రూ.50 లక్షల మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి జమ చేశారు. ఈమేరకు సచివాలయంలో నియోజకవర్గ నాయకులతో కలిసి చంద్రబాబుకు సోమవారం చెక్కును అందజేశారు. కోండ్రుతో ముఖ్యమంత్రిని కలిసిన వారిలో గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, పిన్నింటి మోహనరావు, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, దుర్గబాబు, అప్పలనాయుడు, హరి, గెడ్డాపు సూరపునాయుడు, తదితరులున్నారు.



బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ

సిరిపురం, సెప్టెంబరు 23 : దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా పేలుళ్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల ఎస్పీలను డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈఏడాది రేంజ్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు జరిపే వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. అనుమతి ఉన్న గోడౌన్లు, షాపుల వద్ద భద్రతా ప్రమాణాలు సరిగ్గా ఉన్నదీ లేనిదీ పరిశీలించాలని చెప్పారు. అనధికారికంగా వ్యాపారాలు చేసేవారిని ముందుగా గుర్తించి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయాలని ఆదేశించారు.

శివారున ఉండడమే శాపమా?

- మడ్డువలస ఆయకట్టులో రైతులకు నీటి కష్టాలు
- పూడికతో నిండిన కాలువలు
- ఆధునికీకరణకు చర్యలు తీసుకోని అధికారులు



నీరు లేని మడ్డువలస ఉప కాలువ

మడ్డువలస జలాశయం ఆయకట్టు రైతులమని వారు గొప్పగా చెప్పుకుంటుంటారు.. ఏ నాటికైనా పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోదా అని ఏటా ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ ప్రతి ఏడాదీ నిరాశే ఎదురవుతోంది. పేరుకే ఆయకట్టు రైతులు. చుక్క నీటికీ నోచుకోవటం లేదు. పంట కాలువలు నీటితో కాకుండా పిచ్చి మొక్కలు, పొదలతో నిండడమే ఈ పరిస్థితికి కారణం. సంతకవిటి మండలంలోని గ్రామాల పరిధిలో నెలకొన్న దుస్థితిది. పచ్చని పైరుతో కళగా ఉండాల్సిన దాదాపు 1500 ఎకరాల్లో కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి.

సంతకవిటి, సెప్టెంబరు 23:
మడ్డువలస జలాశయంలో పుష్కలంగా నీరున్నప్పటికీ ఆ నీటిని పంటకు అందించాల్సిన కాలువలు సరిగా లేక రిజర్వాయర్ శివారు ఆయకట్టుకు సంవత్సరాలుగా నీరు అందడం లేదు. కనీస నిర్వహణ లేక కాలువలు పొదలతో నిండిపోయాయి. పూడికలు తీయకపోవడం, ఎక్కడికక్కడ పిచ్చిమొక్కలు చెట్లుగా ఎదిగిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. పోరాటాలతో సాధించుకున్న ఈ భారీ ప్రాజెక్టు తమకు ఎందుకూ ఉపయోగపడడం లేదని ఆయా రైతులు గగ్గోలు పెడుతున్నారు. సంతకవిటి మండలంలోని అప్పలగ్రహారం, శేషాద్రిపురం, బలరాంపేట, మంతిన, సిరిపురం, చిన్న సిరిపురం, జానకిపురం, గెడ్డవలస అగ్రహారం, రంగనాథపేట, గోకర్ణపల్లి తదితర గ్రామాలు మడ్డువలస రిజర్వాయర్ ఆయకట్టులో శివారున ఉన్నాయి. జలాశయం కాలువలు అధ్వానంగా మారడంతో ఈ రైతుల పొలాలకు నీరు అందడం లేదు. ఈ విషయాన్ని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లారు. పరిష్కారం కాలేదు. చేసేది లేక చెరువులు, బావుల నుంచి యంత్రాలతో నీరు తోడించి పంటకు తడి అందిస్తున్నారు. దీనివల్ల కష్టమే మిగులుతోంది కాని ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా విసిగిపోయారు. ఖరీఫ్‌లో వేలాది రూపాయల మదుపులు పెట్టి ఉడుపులు చేపట్టి చివరకు నష్టపోతున్నామంటున్నారు.

చందాలు పోగేసుకుని..


పొదలతో నిండిపోయిన మడ్డువలస కాలువను స్వయంగా బాగు చేయాలని ఇటీవల రైతులంతా నడుం బిగించారు. అప్పలగ్రహారం, శేషాద్రిపురం, బలరాంపేట, మంతిన, సిరిపురం, చిన్నసిరిపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు చందాలు పోగు చేసుకుని ఎక్సకవేటర్‌ను అద్దెకు ఏర్పాటు చేసుకుని కొంతవరకు పూడికలను తొలగించారు. ఇలా నిత్యం చేయలేమని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

కలెక్టరేట్ వద్ద రైతుల నిరసన

కలెక్టరేట్, సెప్టెంబరు 23: ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ఇప్పటివరకూ సాగునీరు అందలేదని, పంటలు ఎలా పండించగలమంటూ సంతకవిటి మండల రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్‌ను కలిసి పరిస్థితిని విన్నవించారు. ఆయన వెంటనే ఇరిగేషన్ అధికారులను పిలిపించి మాట్లాడారు. కాలువల్లో పూడిక తీయడం కోసం రూ.5 లక్షలు మంజూరు చేశామని, ఆ నిధులు ఏం చేశారని ప్రశ్నించారు. పూడిక తీయించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన రైతుల్లో పప్పల విశ్వేశ్వరరావు, అదపాక అచ్చుతరావు, డోల సీతారాం, పతివాడ రాంబాబు, అక్కలపోతు నీలకంఠం తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌ను కలిసేందుకు ర్యాలీగా



ఇంకో 75 రోజుల్లో పుష్ప రూల్

'పుష్ప ద రూల్'.. భారతీయ సినీపరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా ఇది. అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం మరో 75 రోజుల్లో అంటే డిసెంబర్ 6న విడుదల కానుంది. అంటే పుష్ప రూల్‌కు కౌంట్ డౌన్ మొదలైందన్నమాట. అల్లు అర్జున్ నటన కోసం, దర్శకుడు సుకుమార్ టేకింగ్, మేకింగ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కంటెంట్ పరంగానే కాకుండా సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉంటుందని నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ చెప్పారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు, టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందనీ, ఇక వచ్చే ప్రతి ప్రమోషనల్ కంటెంట్ అదిరిపోయే రీతిలో ఉంటుందని వారు తెలిపారు. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

టిక్కెట్ ధర పెంపునకు ప్రభుత్వ అనుమతి



జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న దేవర సినిమా ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దేవర సినిమా టిక్కెట్ల ధరలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అంతేకాదు మిడ్ నైట్ షోలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మిడ్ నైట్ షోలు ఆడించేందుకు 29 థియేటర్లకు అనుమతించింది. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా రిలీజ్ రోజున ఆరు షోలు ఆడించేందుకు థియేటర్లకు అనుమతి ఇచ్చారు. మరుసటి రోజు నుంచి అక్టోబరు 6 వరకు రోజుకు 5 షోలు ఆడించుకునే వెసులు బాటు కల్పించారు. తొలిరోజు టిక్కెట్ ధరలను రూ. 100 పెంచుకునేందుకు అనుమతించారు. సింగిల్ స్ర్కీన్‌లలో టిక్కెట్‌పై రూ. 25, మల్టీప్లెక్స్‌లో రూ. 50 పెంచుకునే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ సినిమాకు టికెట్ రేటు పెంచే సదుపాయం అక్కడి ప్రభుత్వం కల్పించిన సంగతి విదితమే.

అమెరికా వెళ్లిన ఎన్టీఆర్

జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి ప్రణతీతో కలసి అమెరికా బయలుదేరారు. లాస్‌ఏంజిల్స్‌లోని బియాండ్‌ఫెస్ట్‌లో ఈ నెల 26 సాయంత్రం జరిగే దేవర స్ర్కీనింగ్‌కి హాజరు కానున్నారు. అలాగే అక్కడ కొన్ని మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వనున్నారు.




మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. అలాగే ఎ.ఎమ్.బి తరఫున మరో రూ. 10లక్షల చెక్కును కూడా మహేశ్‌బాబు అందజేశారు

సెట్‌లో దర్శకుడి బర్త్ డే



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్ లైన్. సీనియర్ ప్రొడ్యూసర్ బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం నేపాల్‌లో జరుగుతోంది. ఇప్పటికి ఎనభై శాతం చిత్రం పూర్తయిందనీ, ఫ్రెష్ కామెడీతో లాఫింగ్ రైడ్‌లా సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు. సోమవారం దర్శకుడు భాస్కర్ పుట్టినరోజు కావడంతో సెట్‌లో సెలబ్రేట్ చేశారు. ప్రకాశ్‌రాజ్, హీరోయిన్ వైష్ణవి తదితరులు కూడా పాల్గొన్నారు.

చారిత్రక యోధుడి పాత్రలో తొలిసారి!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మళ్లీ ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చారు. ఆయన తొలిసారిగా చారిత్రక యోధుడి పాత్ర పోషిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా తాజా షెడ్యూల్ సోమవారం ఉదయం విజయవాడలో మొదలైంది. కళా దర్శకుడు తోట తరణి రూపొందించిన భారీ సెట్‌లో యుద్ధ సన్నివేశాన్ని దర్శకుడు జ్యోతికృష్ణ చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ నిక్ పావెల్ సారథ్యంలో జరుగుతున్న ఈ చిత్రీకరణలో నాజర్, రఘుబాబు, అయ్యప్ప పి.శర్మ, సునీల్ తదితరులతో పాటు ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నిధి అగర్వాల్ చిత్ర కథానాయిక కాగా, బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.వచ్చే ఏడాది మార్చి 28న 'హరిహర వీరమల్లు' పార్ట్ వన్ విడుదలవుతుందని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. పవన్‌కల్యాణ్‌ను సరికొత్తగా చూడబోతున్నామని ఈ పోస్టర్‌తో హామీ ఇచ్చారు దర్శకనిర్మాతలు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రాన్ని ఎ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకరరావు చెప్పారు,

ఆ వీధికి నాన్న పేరు పెట్టండి

స్టాలిన్‌కు ఎస్పీ చరణ్ వినతి



గానగంధర్వుడు, సినీ నేపథ్యగాయకుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రమణ్యం నివసించిన కామ్‌దార్‌నగర్‌కు ఆయన పేరును పెట్టాలని ఎస్పీబీ తనయుడు, సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ .చరణ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం చెన్నై సచివాలయం ప్రాంగణంలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ సెల్‌లో వినతిపత్రం సమర్పించారు. ఇందులో.. 'సంగీత ప్రపంచంలో తన మధురమైన గాత్రంతో కోట్లాదిమంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జీవించివున్న సమయంలో స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసివుండేవారు. ప్రస్తుతం ఆయన భౌతికంగా లేకపోవడంతో ఆయనను స్మరించుకునేలా ఎస్పీబీ నివసించిన కామ్‌దార్‌నగర్‌కు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నగర్ లేదా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వీధి'గా నామకరణం చేయాలని కోరుతున్నాను. ఈ వినతిని పెద్దమనసుతో అంగీకరించి, తమతో పాటు కోట్లాదిమంది ఎస్పీబీ అభిమానుల కోరికను తీర్చాలని కోరుతున్నాం' అని ఎస్పీ చరణ్ కోరారు. కాగా, ఈ నెల 25వ తేదీన ఎస్పీబీ నాలుగో వర్ధంతి వేడుకలు జరుగనున్న విషయం తెల్సిందే.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఆస్కార్‌కి వెళ్తున్న లాపతా లేడీస్

వచ్చే ఏడాది జరిగే ఆస్కార్ అవార్డుల వేడుకకు ఇండియా నుంచి వెళ్లే సినిమా ఖరారైపోయింది. ఆ చిత్రమే.. బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మాజీ భార్య.. 'ధోబీ ఘాట్' ఫేమ్ కిరణ్ రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్'. 2025 సంవత్సరానికిగాను ఉత్తమ విదేశీ చిత్రాల జాబితాలో మన దేశం నుంచి అధికారిక ఎంట్రీగా 'లాపతా లేడీస్' చిత్రాన్ని నామినేట్ చేస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) ఛైర్మన్ జహ్నూ బారువా ఇతర నిర్వాహకులు రవి కొట్టార్కర, సి.కళ్యాణ్ తదితరులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ఏడాది ఆస్కార్ నామినేషన్ల కోసం తెలుగు, తమిళం, మలయాళం, మరాఠీ, హిందీ భాషలకు చెందిన 29 చిత్రాలను 13 మందితో కూడిన కమిటీ సభ్యులు షార్ట్‌లిస్ట్‌చేయగా, అందులో 'లాపతా లేడీస్'ను అధికారిక ఎంట్రీగా సభ్యులంతా ఎంపిక చేసినట్టు జహ్నూ బారువా వెల్లడించారు. కాగా, మార్చి ఒకటిన విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డులనూ పొందింది.



అలాగే, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం 75వ వార్షికోత్సవాల్లోనూ ఆ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. కొత్తగా పెళ్లైన ఓ గ్రామీణ జంట జీవితాల్లో జరిగిన అనూహ్య సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. వారు ఎదుర్కొన్న అనేక సమస్యలను ఇందులో మనసుకు హత్తుకునేలా తెరకెక్కించడమే ఈ చిత్ర విజయానికి కారణం. ఈ సినిమాతో పాటు తెలుగు చిత్రసీమ నుంచి 'కల్కి 2898 ఏ.డీ', 'హను-మాన్', 'మంగళవారం' చిత్రాలు.. బాలీవుడ్ నుంచి 'యానిమల్', 'కిల్', 'శ్రీకాంత్', 'ఆర్టికల్ 370', 'మైదాన్'.. మలయాళం నుంచి నేషనల్ అవార్డ్ విన్నర్ "ఆట్టమ్', 'ఆడు జీవితమ్', 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్'.. తమిళ్ నుంచి 'వాజై', 'మహరాజా' వంటి 29 చిత్రాలు పోటీ పడ్డాయి.

నమ్మకం నిజమైంది

'లాపతా లేడీస్' ఆస్కార్‌కు ఎంపికైనందుకు దర్శకురాలు కిరణ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఈ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అవుతుందని ఇంతకుముందే ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. నా నమ్మకం నిజమైంది. సినిమా కోసం అహర్నిశలు శ్రమించిన మా చిత్రబృందానికి దక్కిన గుర్తింపు ఇది. భారత్‌లో ఈ సినిమాను ఎలా ఆదరించారో.. అంతర్జాతీయంగానూ అంతే ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని అన్నారు.




అన్నయ్య హగ్ చేసుకున్నాడు



తమిళ నటుడు కార్తీ నటించిన తాజా చిత్రం 'సత్యమ్ సుందరమ్'. '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. అరవింద స్వామి కీలక పాత్ర పోషించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా హీరో కార్తీ మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా స్ర్కిప్ట్‌ను చదవగానే నా కళ్ల వెంట ఆనందభాష్పాలు వచ్చాయి. అద్భుతమైన మానవ విలువలు ఉన్న కథ ఇది. ఈ కథను మొదట దర్శకుడు నవలగా తీసుకువద్దామని రాసుకున్నారు. అదృష్టవశాత్తు ఇది సినిమాగా తెరకెక్కింది. ఇందులో నాది అమాయకత్వం.. చలాకీతనం కలగలసిన క్యారెక్టర్. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన ఫీల్ గుడ్ చిత్రమిది. నా పాత్ర, అరవింద స్వామి పాత్ర గుర్తుండిపోతాయి. '96' చిత్రంలాగే.. ఈ సినిమా కథ కూడా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. గ్రామీణ జీవితాన్ని.. మన సంప్రదాయాల్ని.. మూలాల్ని తిరిగి గుర్తుచేసేలా ఉండే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. గోవింద్ వసంత్ అందించిన మ్యూజిక్ చాలా వినసొంపుగా ఉంటుంది. ప్రతీ పాట అర్థవంతంగా ఉండి హృదయాల్ని కదిలిస్తుంది. ప్రేక్షకులకు రియల్ ఎమోషన్స్‌ను పరిచయం చేసే ఇలాంటి చిత్రాలు రావడం చాలా అరుదు. ఈ సినిమాను చూసిన అన్నయ్య సూర్య చేసుకుని హగ్ చేసుకుని ప్రశంసించారు. నా మొదటి సినిమా తర్వాత ఇన్నేళ్లకు అన్నయ్య అంతలా ఎక్సైట్ అయిన చిత్రమిదే" అని చెప్పారు.



ఇన్ ప్రోగ్రెస్

సంక్రాంతి బరిలో మరో సినిమా



వచ్చే సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల జాబితాలో మరో పేరు చేరింది. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న 30వ సినిమా అది. ఈ చిత్రానికి 'మజాకా' అనే పేరు నిర్ణయించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, రిలీజ్ టైమ్ ఒకేసారి విడుదల చేసి ప్రమోషన్స్ ప్రారంభించారు నిర్మాత.

నీ జతగా



ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా నటిస్తున్న 'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రంలోని మెలోడీ సాంగ్‌ను హీరో గోపీచంద్ విడుదల చేసి కొత్త హీరోకు, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'నీ జతగా' అంటూ సాగే ఈ పాటను గణేశా రచించగా, జావెద్ అలీ పాడారు. వినోద్ యాజమాన్య సంగీత దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చందిన రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు.

కుతంత్రమే ఆమె మంత్రం



విష్ణు మంచు హీరోగా డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి నటి ఐశ్వర్య పోషిస్తున్న మారెమ్మ పాత్రకు సంబంధించిన లుక్‌ను సోమవారం విడుదల చేశారు. అందరినీ భయపెట్టే విధంగా ఈ లుక్ ఉంది. 'అడవిని పీడించే అరాచకం.. మారెమ్మ, కుతంత్రమే ఆమె మంత్రం' అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంది. డిసెంబర్‌లో విడుదలయ్యే ఈ పాన్ ఇండియా మూవీకి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు.

ఏఐ మ్యూజిక్‌తో 'ఐ వాంట్ లవ్'



డైరెక్టర్ ఆర్జీవీ బ్యానర్‌పై గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'శారీ'. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రవి వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలోని మొదటి గీతం 'ఐ వాంట్ లవ్'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "ఈ సినిమాలోని మొత్తం పాటలను ఏ.ఐను ఉపయోగించే కంపోజ్ చేశాము. నేపథ్య సంగీతానికి కూడా ఏ.ఐతోనే ముందుకు వెళ్తాం. ఇకపై 'ఆర్జీవీ మ్యూజిక్ డెన్' నుంచి వచ్చే ప్రతీ పాటలో ఏ.ఐ యాప్స్‌తో తయారు చేసిన సంగీతం మాత్రమే ఉంటుంది" అని చెప్పారు.

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ తిరుపతిలో ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ తిరుపతి)- ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెగ్యులర్(ఫుల్ టైమ్ స్కాలర్స్), ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ విధానంలో ఎంపికైన అభ్యర్థులకు వివిధ స్కీమ్‌ల ద్వారా అసిస్టెంట్‌షిప్ లభిస్తుంది. ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ విధానాల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఉద్యోగులై ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/జాతీయ స్థాయి ల్యాబొరేటరీల నుంచి స్పాన్సర్‌షిప్ తప్పనిసరి.

ఎంఎస్(రీసెర్చ్)

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ(ఎమ్మెస్సీ/ఎంసీఏ)తో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

పీహెచ్‌డీ

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఇంజనీరింగ్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ లేదా డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 8 సీజీపీఏతో ఐఐటీ నుంచి(జామ్ ద్వారా ప్రవేశం పొంది ఉండాలి) రెండేళ్ల ఎమ్మెస్సీ; సీఎఫ్‌టీఐ సంస్థ నుంచి బీఎస్+ఎంఎ స్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్) ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్సెస్ విభాగాలకు సెంట్రల్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్/గేట్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** నవంబరు 5 నుంచి 18 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** డిసెంబరు 2
- **వెబ్‌సైట్:** https://iittp.ac.in

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 294 వినతులు

స్వీకరించిన కలెక్టర్ అంబేడ్కర్, జేసీ మాధవన్

కలెక్టరేట్: విజయనగరం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 294 వినతులు వచ్చాయి. వాటిని కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్ స్వీకరించారు. ఇందులో రెవెన్యూ 227, డీఆర్‌డీఏ 24, పంచాయతీ రాజ్ 10, గృహ నిర్మాణ సంస్థ 9, ఐసీడీఎస్, విద్యా శాఖ 7, వైద్య ఆరోగ్య శాఖకు 6 వినతులు వచ్చాయి. వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ● విజయనగరం పట్టణంలోని సంతకాల బ్రిడ్జి వద్ద విశాఖపట్టణం నుంచి విజయనగరం పట్టణంలోకి ప్రవేశించే వాహనాల రద్దీ రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యను అధిక మించడానికి ఎత్తు బ్రిడ్జి జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ మధ్యలో అండర్‌పాస్, ఎప్రోచ్ రోడ్డు నిర్మించాలని విజయనగరం నియోజకవర్గం టీడీపీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో మున్సిపాల్టీ నుంచి సాధారణ నిధులు నుంచి రూ.6 కోట్లు నిధులు మంజూరు చేస్తూ కౌన్సిల్ తీర్మాణం చేశారన్నారు. వెంటనే అండర్‌పాస్ నిర్మించాలని టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీ మోహన్, బి.నర్సింగరావు తదితరులు ఉన్నారు. ● వారసత్వంగా వచ్చిన భూమిని నలుగురు వారసులు ఉండగా కొంత భూమిని ఒక వ్యక్తిపేరుమీద గతంలో పని చేసిన తహసీల్దార్ ఆన్‌లైన్‌లో మార్పు చేశారు. తమభూములు వ్యవహారం కోర్టులో ఉండగా ఆన్‌లైన్‌లో తహసీల్దార్ ఏలా మార్పు చేశారో తెలియడం లేదని జామి మండలం విజినిగిరి గ్రామానికి చెందిన యడ్ల వరలక్ష్మి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించుకున్నారు. వెంటనే తహసీల్దార్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీకి అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డు


రాజ్యలక్ష్మి

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మికి 'అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ' అవార్డు లభించింది. ఈ విషయాన్ని సీఎస్‌సీ ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సలెంటంట్ వై.రామ్మోహన రావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సిస్(సీఎస్‌సీ ఇండియా) నీతి అయోగ్ ఈ అవార్డుకి ఆమెను ఎంపిక చేసింది. ఇంజనీర్స్ డే సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వర్చువల్‌గా ఈ విషయాన్ని ప్రకటించి, ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ అందించారని తెలిపారు. ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి దార్శనికత, ఇంజనీరింగు విద్యా రంగంలో ఆమె చేసిన దీర్ఘకాలిక కృషిని ప్రశంసించారు. ఆమె నాయకత్వం భవిష్యత్తు తరాలకు ప్రేరణనిచ్చేలా ఉందని ఆయన చెప్పారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, విశ్వవిద్యాలయం డైరక్టర్లు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, బోధనేతర సిబ్బంది విద్యార్థులు ఆమెను అభినందించారు.

ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్ ● గ్రీవెన్స్‌కు 81 ఫిర్యాదులు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 23: జిల్లాలోని పోలీసు స్టేషన్ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా 81 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులపై పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి.. సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించి 23, కుటుంబ కలహాలకు సంబంధించి 7, మోసాలకు పాల్పడినట్టుగా 17, ఇతర విషయాలకు సంబంధించి 34 ఫిర్యాదులు ఉన్నాయని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని వాటి పూర్వాపరాలను విచారణ చేసి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, యూనివర్స్, ఎస్‌బీ సీఐ లీలారావు, ఎస్ఐ వాసుదేవ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

అర్హుల జాబితాలు ప్రదర్శించండి: కలెక్టర్

● వర్షాల్లో ఇళ్లు దెబ్బతిన్న వారికి 25న ఖాతాల్లోకి పరిహారం

కలెక్టరేట్: జిల్లాలోని భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకు అర్హులైన వారి జాబితాలను సోమ, మంగళవారాల్లో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించి దీనిపై ఎవరికైనా అభ్యంత రాలుంటే వాటిని స్వీకరించి నివేదించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 66 గృహాలు దెబ్బతిన్నాయని, వాటికి పరిహారం అందించాలని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నుంచి తహసీల్దార్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు దెబ్బతిన్న వారికి ఈనెల 25న బ్యాంకు ఖాతాల్లోకి పరిహారం జమ చేయనున్నామన్నారు. పంట నష్టం వివరాలకు సంబంధించి రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించాలన్నారు. రానున్న రెండు వారాలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పొలం పిలుస్తోంది పోస్టర్లను కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్ ఆవిష్కరించారు.

ధర్మవరం గ్రామానికి తప్పిన పెనుముప్పు

● కొమటిచెరువుకు గండి ● ఉదయమే పూడ్చిన రైతులు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి సోమవారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల చెరువులోకి అధికంగా నీరు చేరడంతో గండి పడింది. ఇది ఉదయం 7 గంటల సమయంలో మొదలు కావడంతో అటుగా వెళ్లిన రైతులు ఈ విపత్తును గమనించి గ్రామస్థులకు సమచారం ఇచ్చారు. వెంటనే వారు ఈ గండిని ఇసుక బస్తాలు వేసి పూడ్చారు. ఆలస్యంగా చూసి ఉంటే గ్రామం ముంపునకు గురయ్యేదని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు ముంపు తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు ధర్మవరం చెరువు గండి ప్రాంతానికి చేరుకున్నారు. గండిని నిరోధించిన రైతులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోమటిచెరువు విస్తీర్ణం 33 ఎకరాలు కాగా చాలా వరకు ఆక్రమణలు జరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టి ఆక్రమణలు తొలగించాలని కోరుతామన్నారు. అయితే వర్షాలు ఉధృతంగా పడుతున్న సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన ఇరిగేషన్ అధికారులు ఎవ్వరు లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీపీ సోమేశ్వర రావు, సర్పంచ్ సన్యాసయ్య, ఈవో రంగారావు, క్షేత్రసహాయకుడు పెంట దేముడు బాబు ఆయకట్టు రైతులు ఉన్నారు.


గండిపడిన ప్రాంతాన్ని రైతులతో కలిసి పరిశీలిస్తున్న సుధారాజు

మంత్రి కొండపల్లి అమెరికా పర్యటన

విజయనగరం(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పది రోజుల పాటు అమెరికా పర్యటన నిమిత్తం సోమవారం రాత్రి హైదారాబాద్ నుంచి బయలుదేరారు. ఈ పర్యటనలో భాగంగా, ఎంఎస్ఎంఈ, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖాలకు భాగస్వామ్య ఒప్పందాల కోసం వివిధ సమావేశాల్లో మంత్రి పాల్గొంటారు. పర్యటన ముగించుకుని వచ్చేనెల 3న ఆయన తిరిగి రాష్ట్రానికి రానున్నారని మంత్రి కార్యాలయం ఓ ప్రటనలో తెలిపింది.

దూర విద్యా కోర్సులను ప్రోత్సహించండి

కొత్తవలస: దూర విద్యాకోర్సులను ప్రోత్సహించాలని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్రపరిశీలకుడు జి.గోపీకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన కొత్తవలస జిల్లా పరిషత్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూరవిద్యా కోర్సుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం సార్వత్రిక విద్యను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. 2021-22 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యకు దూరమై 14 సంవత్సరాలు నిండిన వారు ఖచ్చితంగా 10 వతరగతి దూర విద్యను పూర్తి చేయడానికి ప్రోత్సహించాలని తెలిపారు. పదో తరగతి చదివి పని చేసుకుంటున్న వారు ఇంటర్మీడియట్ ఒక్క సంవత్సరంలోనే ఉత్తీర్ణులు కావచ్చునని తెలిపారు. 2024-25 సంవత్సరాలకు సంబంధించి అడ్మిషన్ ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 28 వరకు అడ్మిషన్‌లకు గడువు ఉందని, 29, 30 తేదీల్లో 200 రూపాయలు అపరాధ రుసుముతో అడ్మిషన్ పొందొచ్చనని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ ఈశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో ఎన్‌జీవో హోంలో సోమవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత ఎన్.రమేష్‌కు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు, జోగినాయుడు, ప్రవీణ్ కుమార్, శ్రీరామ మూర్తి, రమేష్, లక్ష్మణరావు, ఎల్లయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు చెకుముకి టాలెంట్ టెస్ట్

బొబ్బిలి రూరల్: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో బుధవారం 8, 9, 10 తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వ హించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక మండలాధ్యక్షుడు శంబంగి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం అలజంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక బొబ్బిలిశాఖ ఆధ్వర్యంలో హెచ్ఎం పి.నిర్మలాదేవి చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ముగ్గురిని ఎంపికచేస్తామని, వీరు అక్టోబరు ఒకటోతేదీన జరిగే మండల స్థాయి పరీక్షకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆనెం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కృష్ణదాస్ పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: బొబ్బిలి మండల లీగల్ సర్వీసెస్ కమిటీలో పారా లీగల్ వలంటీరుగా చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిటీ ఛైర్‌పర్సన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదువుకున్న వారు వలంటీర్‌గా చేరవచ్చని, ఎటువంటి జీతభత్యాలు, పారితోషికం చెల్లించరని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30 లోగా స్థానిక కోర్టులో గల మండల న్యాయసేవా కమిటీని సంప్రదించి తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎస్.కోటను వదలని వాన

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో సోమవారం రాత్రి 7గంటల సమయంలో భారీగా వర్షం పడింది. శనివారం నుంచీ రోజూ సాయంత్రం రోజు భారీ వర్షం కురుస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి పనుల నిమిత్తం వస్తున్న వారంతా ఇబ్బందులు పడుతున్నారు. శ్రీనివాసకాలనీ, విశాఖ-అరకు రోడ్డు జలమయమవుతుంది. దీంతో సాయంత్రమైతే స్థానికులకు భయం పట్టుకుంది. ఆదివారం రాత్రి జిల్లాలో ఎస్.కోటలో అత్యధికంగా వర్షం పడింది. 96.2 మీమీ వర్షపాతం నమోదైంది.

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ

వీరఘట్టం: తూడి గ్రామంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో ఏవో సౌజన్య, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటరమణ, గ్రామ వ్యవసాయ సహాయకుడు అభిలాష్, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ చానెల్ మాజీ చైర్మన్ నమ్మక పాండురంగారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారత్‌టెక్ లీగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని ఫోర్టుసిటీ పాఠశాల విద్యార్థులు భారత్ టెక్ లీగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు వున్న స్కూళ్లకు టెకీ బాట్ సంస్థ నిర్వహించిన భారత్ టెక్ లీగ్ పోటీలను నాలుగు అంశాల్లో మూడు స్థాయిల్లో నిర్వహించారు. ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, రాష్ట్రాలకు సంబంధించిన 150 పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 22న ఏయూ కళాశాల, ఏ హబ్‌లో మూడో స్థాయి పోటీలు నిర్వహించారు. తొలి, రెండో స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఫోర్టుసిటీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, శ్యామ్ మనోహర్, డి సాయి పార్థసారధి, మెహర్‌శ్రీ తరుణ్ రోబోటిక్స్ అంశంలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు, డ్రోన్ టెక్నాలజీ విభాగం ఎండీ రెహన్, బి ఉదయ్‌కుమార్, ఎం తేజ ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా చైర్మన్ కేపీపీ రాజు మాట్లాడుతూ, తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులను వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టరు రోహినాఖాన్, డైరక్టర్లు మధు, అశోక్, నీలిమ అభినందించారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో డైరక్టర్లు మధు, ప్రిన్సిపాల్ రోహినాఖాన్

వ్యాయామ ఉపాధ్యాయుల కార్యవర్గం ఏర్పాటు

విజయనగరం టౌన్: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటయ్యింది. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్.భీమ్ శంకరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, ఏపీ రెసిడెన్సీ, గిరిజన సంక్షేమం, ప్రైవేటు కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య సలహాదారులుగా మంజులా వీణా (డీవీఈఓ- పార్వతీపురం), వినోద్‌బాబు (ప్రిన్సిపాల్- జీజేసీ, చీపురుపల్లి), సహాయ కార్యదర్శిగా ఉమామహేశ్వరరావు (పీడీ- బాడంగి) ను నియమించినట్లు భీమ్‌శంకర్‌రావు తెలిపారు.


వ్యాయామ ఉపాధ్యాయుల కార్యవర్గం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వరద బాధితులకు వితరణ


బేబీనాయనకు చెక్కును అందిస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడలో బొబ్బిలి పాస్టర్స్ అసోసియేషన్ తరఫున విజయవాడ వరద బాధితులకు రూ. 20,000 ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)కు ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు పాల్గొన్నారు.

ఈ లాటరీ ద్వారా ఇళ్ల స్థలాల కేటాయింపు

కలెక్టరేట్: డెంకాడ మండలం రఘుమండ వద్ద వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్ లే అవుట్‌లో మిగిలిన 44ఎంఐజీ ఇళ్ల స్థలాల కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఈ-లాటరీ ప్రక్రియను నిర్వహించారు. జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో అనిత సమక్షంలో కంప్యూటర్ ద్వారా లాటరీ నిర్వహించి స్థలాలను కేటాయించారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు సదుపాయం కోసం జిల్లాలోని రఘుమండ, జియ్యన్నవలస, చీపురుపల్లిలో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్ లేఅవుట్లను వీఎంఆర్‌డీఏ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేశామన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

శృంగవరపుకోట: శృంగవరపుకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని తహ సీల్దార్ అరుణకుమారీకి వినతి పత్రం అందించారు. రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి రమణ, కె. రామారావు తదితరులున్నారు.


తహసీల్దార్ అరుణకుమారికు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ, రైతులు

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ పోటీలు


ఖో- ఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణ శివారు విజ్జీ మైదానంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్- 14, అండర్- 17 విభాగాల్లో ఖో- ఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మురళి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి సీతారామరాజు, తౌడుబాబు, పీడీలు రామకృష్ణ, వాణి, రవి, ప్రవీణ్, శేఖర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూముల సమస్యను పరిష్కరిస్తా

గరుగుబిల్లి: పోలినాయుడువలసలో ఇనాం భూముల సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. సోమవారం గొట్టివలసలో పర్యటించిన ఆమెకు పలువురు రైతులు తమ సమస్యను వివరించారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మర్రాపు పురుషోత్తంనాయుడు సాగు చేసుకుంటున్న భూములకు పలు రకాల ఇబ్బందులు నెలకొన్నాయని, దీని కారణంగా ఈ-క్రాప్ చేయలేని స్థితిలో ఉన్నారన్నారు. అలాగే 1బీలు రావడం లేదని చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తానని హామీఇచ్చారు. పోలినాయుడువలసకు చెందిన గంటా మధుసూదనరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి పై చర్చ


విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఈస్టుకోస్టు రైల్వే వాల్తేరు డివిజన్ పరిధిలో సోమవారం విశాఖపట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో డివిజనల్ కమిటీ సమావేశం జరిగింది.. కేంద్రమంత్రి రామ్మోహననాయుడు, విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డివిజనల్ జనరల్ మేనేజరు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

70 పీహెచ్‌సీల్లో నిలిచిన వైద్యసేవలు

● ఓపీలు చూడటం మానేసిన పీహెచ్‌సీల వైద్యులు

● 104 సేవల్లో కానరాని వైద్యులు

శృంగరపుకోట రూరల్: జిల్లాలో వున్న 70 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న 150కి మంది వైద్యులు తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గడిచిన పదిరోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో పీహెచ్‌సీల్లో, 104 వైద్యసేవల్లో వీరు కనీసం కనిపించడం లేదు. కేవలం అత్యవసర వైద్యసేవలకు మాత్రమే హాజరవుతున్నారు. ముఖ్యంగా పీహెచ్‌సీల్లో వీరు ఓపీ చూడటం మానేయడంతో అక్కడ ఉన్న స్టాఫ్‌నర్స్‌లే వైద్యుల అవతారం ఎత్తి గ్రామీణులకు వైద్యసేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు విధులకు రాకపోవడంతో ఆర్‌ఎంపీలు పండగ చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆర్‌ఎంపీలకు, పీఎంపీలకు డిమాండ్ పెరిగింది. వైద్యులు ముఖ్యంగా పలు డిమాండ్లతో పాటు వైద్యశాఖలో వేగవంతంగా ప్రమోషన్లు ఇవ్వాలనీ, 20 ఏళ్లనుంచి ప్రమోషన్లు లేవని తమకు కుడా ఆరేళ్లకు ఒకసారి కేడర్ పెంచాలని.. ఇలా 12,18 ఏళ్లకు ఇవ్వాలనీ తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నారు.


ధర్మవరంలో వైద్యులు లేకుండానే 104 సేవలు, కొట్టాం పీహెచ్‌సీలో వైద్యురాలిగా మారి సేవలు అందిస్తున్న స్టాఫ్‌నర్స్

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి


శ్రీధర్ (ఫైల్)

కురుపాం: దాడి ఘటనలో గాయపడిన ఓ యువకుడు సోమవారం తెల్లవారుజామున ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కురుపాం పోలీసులు సోమవా రం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం గ్రామం గౌడువీధికి చెందిన గౌడు శ్రీధర్(23) ఈనెల 13వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన మరో యువకుడు వ్యక్తిగత కక్షలతో దాడి చేశాడు. ఈ దాడిలో గాయాలపాలైన శ్రీధర్‌ను కుటుంబీకులు ఆస్ప త్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కురుపాం పోలీసులు కేసు నమోదు చేశారు. అయి తే విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీధర్ సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధు వులకు అప్పగించారు. శ్రీధర్‌కు ఏడాది వయసున్న పాప ఉంది. భార్య ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భిణి.

చికిత్స పొందుతూ యువకుడు..


సురేష్ (ఫైల్)

శృంగవరపుకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొట్టాం గ్రామం వద్ద శనివారం ఉదయం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కొట్టం నుంచి ధర్మవరం వైపు వస్తున్న ఆదిరెడ్డి సురేష్(33) తీవ్రంగా గాయపడ డంతో చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించాడు. మృతుడి స్వగ్రామం సన్యాసయ్యపాలెం కాగా కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారంతా రోడ్డున పడ్డారని స్థానికులు విచారం వ్యక్తం చేశారు. ఎస్ఐ భాస్కరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నదిలోపడి వృద్ధుడు..


దేముడు (ఫైల్)

జామి: నదిలో ఇసుకకోసం తీసిన గోతుల్లో ప్రమాదవశాత్తు చిక్కుకుని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, ఏఎస్ఐ నరసింగరావు, తహసీల్దార్ కృష్ణలత తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి. జామి గ్రామానికి చెందిన కొత్తలి దేముడు(64) గేదెలను కడిగేందుకు ఆదివారం సాయంత్రం గోస్తనీనదిలోకి దిగాడు. అయితే ఈ గేదెలు నది అవతలి భా గానికి వెళ్లడంతో వాటిని తీసుకురావడానికి నదిగుండా అవ తలి వైపునకు వెళ్తుండగా నది మధ్యలో ఇసుక సేకరణ కోసం తీసిన గోతుల్లో చిక్కుకుని మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీస్, అ గ్నిమాపకశాఖలతో పాటు మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు ప్రత్యేకంగా మను షులను ఏర్పాటు చేయించి మృతదేహం కోసం గాలించారు. సోమవారం సా యంత్రం మృతదేహాన్ని నదిలో గుర్తించారు. కేసును ఏఎస్ఐ నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

డెంకాడ: డెంకాడ మండలంలోని నాతవలస వద్ద గల టోల్ ప్లాజా సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం నాతవలస టోల్‌ప్లాజా దగ్గర ఎన్‌హెచ్ 26 రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి(బిచ్చగాడు) ఢీ కొనడంతో ఘటనా స్థలంవద్దే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని కేంద్రాసుపత్రికి తరలించినట్లు, కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడి ఒకరు..

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలసకు చెందిన టొంపలి సూర్యనారాయణ(50) చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కుటుంబ తగాదాల వల్ల సూర్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. ఈనేపథ్యంలో మనస్థాపం చెంది ఈనెల 22న గడ్డి మందు తాగాడు. దీంతో హుటాహుటిన బంధువులు బాడంగి పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరంలోని ఓ ఆసుపత్రికి తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి కుమార్తె సాయిలక్ష్మి, కుమారుడు సాయికిరణ్ ఉన్నారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

గోడ కూలి గిరిజనుడికి గాయాలు

రామభద్రపురం: మండలంలోని మూలశెలగాం గ్రామానికి చెందిన గిరిజనుడు కారంగి లక్ష్మణరావుకు సోమవారం మట్టిగోడ కూలడంతో తీవ్రంగా గాయపడ్డాడని పోలీసుల తెలిపారు. ఉదయం టీ తాగుతుండగా ఒక్కసారిగా గోడ కూలడంతో తలపై తీవ్ర గాయాలుకావడంతో బాడంగి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహరాజా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణ రావు కూలిపనిచేస్తూ జీవిస్తున్నాడు.

43 మద్యం సీసాల స్వాధీనం

బాడంగి: మల్లంపేట చెరువు వద్ద 43 మద్యం సీసాలను బొత్సవానివలసకు చెందిన సత్యనారాయణ నుంచి సోమవారం స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

జి.సిగడాం: ఉపాధి కోసం వసల వెళ్లిన యువకుడు రైలు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాధ చాయంలో అలముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలం అనందపురం గ్రామానికి చెందిన డొప్ప ధనుంజయరావు (26) గుంటూరులోని ఓ కోల్డ్ స్టోరేజ్ (మిర్చియార్డ్)లో పని చేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ధనుంజరావు.. తిరిగి గుంటూరు వెళ్లేందుకు ఆదివారం ఉదయం చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. ఈ క్రమం లో నెల్లిమర్ల చెంపావతి వంతెన వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని ధనుంజ యరావుతోపాటు ఉపాధికి వెళ్తున్న అదే గ్రామానికి చెందిన పోతురాజు నారాయణ రావు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటీనా ఘటనా స్థలానికి చేరుకుని రోదిస్తున్నారు. ధనుంజయరావుకు భార్య మంగమ్మ, ఇద్దరు పిల్లలు రెండేళ్ల పాప నిచిత, ఆరు నెలల బాబు విరాట్ ఉన్నారు. ఆమదాలవలస జీఆర్‌పీ పోలీసులు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. అనంతరం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోక్సో కేసులో యువకుడికి 20ఏళ్ల జైలు

పూసపాటిరేగ: మండలంలోని పెదపతివాడ గ్రామానికి చెందిన కలిశెట్టి ఉమా మహేశ్వరరావు(23)కి పోక్సో కేసులో 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.7వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2023 సంవత్సరంలో ఉమామహేశ్వరరావు ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడగా, బాధితురాలి తల్లి జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి కాగా, దీనిపై సోమవారం విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు న్యాయాధికారిణి కె.నాగమణి నిందితుడికి శిక్షను విధించారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెంటాడ: మండల పరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. లోతుగెడ్డ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 21లో సుమారు 214 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కుట్ర జరుగుతున్న విషయమై ఈనెల 22న ఆంధ్రజ్యోతిలో 'మీకింత...మాకెంత?' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ భూమిపై పట్టాలు పొందేందుకు ఓ సంఘ నాయకులు పొరుగున ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజనులను తెరపైకి తెస్తున్నట్టు తెలుస్తోందని తహసీల్దార్ తెలిపారు. అటువంటి ప్రయత్నాలను విరమించుకోవాలని హితవు పలికారు. ఎవరైనా ఆ భూమిపైకి వెళ్లినా... హెచ్చరికలను అతిక్రమించినా పోలీసు కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు.

త్రోబాల్‌లో మెరిసిన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

గుర్ల: ఈ నెల 21, 22 తేదీలలో విశాఖపట్టణంలో 34వ రాష్ట్రస్థాయి జూనియర్స్ త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానం సాధించారు. ఈ జట్టులోని చింతలపేట విద్యార్థిని ఎస్.జ్యోతి సాయి, బాలుర జట్టులో ఆడిన చింతలపేట విద్యార్థి కె.మురళి ప్రతిభ కనబరిచారు. అక్టోబరు 3, 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో మురళి పాల్గొంటాడని పీఈటీ కె.లక్ష్మణ్ తెలిపారు. మురళిని, కాంస్య పతకం సాధించిన జ్యోతిసాయిని హెచ్‌ఎం గౌరీదేవి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

చీపురుపల్లి డీఎస్పీగా రాఘవులు


డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లి: చీపురుపల్లి డీఎస్పీగా ఎస్.రాఘవులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం రూరల్‌లో ఇంటిలిజెన్స్ విభాగంలో పని చేసిన రాఘవులు చీపురుపల్లికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ విధులు నిర్వహించిన చక్రవర్తి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాఘవులు మాట్లాడుతూ చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో నేరాల అదుపునకు, శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

గజపతినగరం: స్థానిక వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏడీఏ కె.మహరాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కాళంరాజపేట, శ్రీరంగరాజపురం, బుధవారం తుమ్మికాపల్లి, లోగిశ గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

గిరిజన సాగుదారులకు పట్టాలివ్వాలి



ధర్నా చేస్తున్న గిరిజన రైతులు

మెంటాడ: గిరిజన సాగుదారులకు పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు చేయాలని కౌలు రైతుల జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ధర్నా నిర్వహించారు. అటవీ, డిపట్టా భూములు, పోడు భూములలో సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కు పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు, రాయితీలకు దూరమవుతున్నారని అన్నారు. అసంపూర్తిగా మిగిలిన గుర్లగెడ్డ మినీ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కె.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు దేశాయి సింహాచలం, రాకోటి అప్పారావు, పి.రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ చినమ్మలు బదిలీ

గజపతినగరం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ చిన్నమ్మలుకు బదిలీ అయింది. ఆమె కొత్తవలసకు బదిలీపై వెళుతున్నారు. శ్రీకాకుళం నుంచి తవిటయ్య బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నీటి వనరులను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న ఉమాశంకర్

నెల్లిమర్ల: ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకోవాలని... నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సారిపల్లి గ్రామంలో సోమవారం వర్షం నీటి నిల్వ, ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని కోరారు. జిల్లా ప్రజారోగ్య అధికారి కె.దక్షిణామూర్తి మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడాల్సి ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూక్ష్మ నీటి వనరుల పథకం ప్రాజెక్టు డైరెక్టర్ పీఎన్‌వీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ జి.గిరిబాల, గ్రామ పెద్దలు ఏఈ పాషా, ఎస్‌బీఎం కన్సల్టెంట్ టి.సుధాకర్, జల్‌జీవన్ మిషన్ ప్రతినిధులు రాఘవరావు, లక్ష్మణ, విజయ్‌బాబు,పంచాయితీ కార్యదర్శి బి.భవాని, ఏపీఓ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

శరత్‌కు నేతల నివాళి



శరత్ భౌతిక దేహం వద్ద నాయకులు

గజపతినగరం: జనసేన పీఏసీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు శరత్ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు అరుణ ఇంటికి వెళ్లి..శరత్ భౌతిక దేహం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే లోకం మాధవి, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, డాక్టర్ కె.ఎ.నాయుడు, భంజ్‌దేవ్ తదితరులు అరుణ కుటుంబాన్ని పరామర్శించారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గంట్యాడ: కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘ నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ అన్నదాతకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇవ్వాలని, అన్ని పంటలకు ఉచిత బీమా అమలు చేయాలని కోరారు. రైతులకు రూ.2 లక్షల వరకూ రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసాన్ని పొందిన ప్రభుత్వం

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు


పూసపాటిరేగ: బ్రోచర్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి


ఎస్.కోట రూరల్: కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చీపురుపల్లి: బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లోనే తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నదని, రాష్ట్రంలో ప్రభుత్వ పాలనను గాడిలో పెట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజయం సాధించారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం పేరిపిలో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. గడచిన వంద రోజుల్లో ప్రభుత్వం పూర్తిగా ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టిందన్నారు. ఐదేళ్ల పరిపాలించిన గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, దన్నాన రామచంద్రుడు, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, ఎలకల అప్పారావునాయుడు, మోపాడ తేజేశ్వరరావు, కోరాడ కోటీశ్వరరావు, బైరెడ్డి లక్ష్మణరావు, మహంతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికలతో ప్రణాళికలు

పూసపాటిరేగ: పంచాయతీలలో ప్రజావేదికల ద్వారా 2047కు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని..తద్వారా మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. సోమవారం కొవ్వాడ అగ్రహారంలో నిర్వహించిన ప్రజావేదిక, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి 100రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను తెలిపారు. దీనికి సంబంధించిన స్టిక్కర్లను ఆమె అతికించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకరరావు, నాయకులు మహంతి చిన్నంనాయుడు, సర్పంచ్ కోట్ల రఘు, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్ ప్రశంసలు

కొవ్వాడ అగ్రహారం సర్పంచ్ కోట్ల రఘు ఆగ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో కూటమి ప్రభుత్వాన్ని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించలేదని విమర్శించారు. ఈ మూడు నెలల కాలంలో పింఛన్ల పంపిణీతో పాటు ప్రకృతి విపత్తులపై తీసుకున్న చర్యలు కొనయాడవలసిందేనని అన్నారు. మొత్తం కార్యక్రమం తానై నడిపించడం విశేషం.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

బొబ్బిలి రూరల్: తెలుగు ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) తెలి పారు. సోమవారం మండలంలోని కారాడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్ర మం నిర్వహించారు. తొలుత అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికా హార స్టాల్‌ను పరిశీలించి గర్భిణులకు చీర, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో పి.రవికుమార్ వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు, పథకాలు వివరించారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు, అల్లాడ భాస్కరరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, దత్తి దాలినాయుడు, తెర్లి శేఖర్, కొర్లాపు ఆదినారాయణ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

శృంగవరపుకోట రూరల్: పేద, మధ్య తరగతి జీవితాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరింత సంతోషం నింపబోతున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం మండలంలోని శివరామరాజుపేట గ్రామంలో సర్పంచ్ ఝాన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


బొబ్బిలి రూరల్: కరపత్రం ఆవిష్కరిస్తున్న బేబీనాయన

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యం


గజపతినగరం: వైద్య శిబిరంలో పాల్గొన్న పావని

నెల్లిమర్ల: పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయితీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, జనసేన, టీడీపీ నాయకులు చనమల్లు వెంకటరమణ, కడగల ఆనంద్‌కుమార్, లెంక అప్పలనాయుడు, రవ్వా నాని, జనా ప్రసాద్, అంబళ్ల అప్పలనాయుడు, జమ్ము నారాయణరావు, సంచాన శ్రీనివాసరావు, పతివాడ గోవిందరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి...

గజపతినగరం: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని సూచించారు. సోమవారం స్థానిక సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, వృద్ధులు, వికలాంగులు వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ దుర్గాప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు గోపాలరాజు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

పారాది కాజ్‌వేపై నుంచి భారీ వాహనాలకు అనుమతి


కాజ్‌వే పైనుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

బొబ్బిలి రూరల్: వేగావతి నదిపై గల పారాది కాజ్‌వేపై నుంచి భారీ వాహ నాల రాకపోకలకు అధికారులు అనుమతిఇచ్చారు. పారాది గ్రామ శివారున వేగావతి నదిపై ఉన్న బ్రిడ్జి దెబ్బతినడంతో తాత్కాలిక కాజ్‌వే భారీ వాహనాల రాకపోకలకు నిర్మించిన విషయం విదితమే. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ఆ కాజ్‌వే వరద నీటిలో దెబ్బతింది.దీంతో భారీ వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. అయితే వేగావతి నీటి వరద తగ్గడంతో మళ్లీ కాజ్‌వేకు మరమ్మతులుచేశారు. దీంతో సోమవారం కాజ్‌వే గుండా భారీ వాహనాలకు అనుమతించారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి భరోసా: ఎమ్మెల్యే

బొబ్బిలి: పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సంక్షే మానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. సోమవారం బొబ్బిలి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో సఫాయి మిత్ర సురక్ష పేరుతో వైద్యాధికారి జి.శశిభూషణరావు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల కోసం వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మాట్లాడుతూ 150 పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు వైద్యసేవలందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అల్లాడ భాస్కరరావు, మడక తిరుపతినాయుడు, కర్రి అప్పలనాయుడు, ఏగిరెడ్డి శ్రీధర్, గొట్టాపు సత్యనారాయణ పాల్గొన్నారు.

నెల్లిమర్ల కమిషనర్‌గా అప్పలరాజు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయితీ కమిషనర్‌గా పి.అప్పలరాజు నియమితులయ్యారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మునిసిపాలిటీలో పనిచేసి ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. ఇంత వరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన పి.బాలాజీ ప్రసాద్ కొద్ది రోజుల క్రితం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే.

ఎమ్మెల్యేని కలిసిన అవనాపు

డెంకాడ(భోగాపురం): జనసేన పార్టీలో చేరనున్న నేపథ్యంలో అవనాపు విక్రమ్, డాక్టర్ అవనాపు భావన దంపతులు సోమవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవిని భోగాపురం మండలం ముంజేరులో గల ఆమె స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 26న జనసేన పార్టీలో చేరుతున్న విషయాన్ని ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సమావేశంలో సంపత్ ఈశ్వరరావు, ఏర్నింటి నరసింగరావు, మద్దిల అప్పలనాయుడు, షేక్ మారేష్, అవనాపు విజయ భాస్కర్, మద్దిల దుర్గారావు, వంక అప్పలరాజు, సిరిశెట్టి పైడిరాజు, మద్దిల నారాయణరావు, జరజాపుపేట నాయకులు నల్లి శేఖర్, ఎంఎం నాయుడు, మద్దిల అప్పన్న, అవనాపు మురళి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేత సరికాదు

గంట్యాడ: రామవరం బీసీ కాలనీ సమీపంలో విజయనగరం నుంచి గంట్యాడకు వెళ్లే రహదారి పక్కన ఉన్న చెట్లను అక్రమంగా నరికి వేయడం సరికాదని పర్యావరణవేత్త బొబ్బిలి రామకృష్ణ ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. కదంబం, నేరేడు చెట్లను సచివాలయ సిబ్బంది తొలగించారని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉంటే కొమ్మలను మాత్రమే తొలగించాలని... చెట్లను తొలగించాలంటే తప్పకుండా అమమతి తీసుకోవాలని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేత సువ్వాడ రవిశేఖర్ తదితరులు

నెల్లిమర్ల: దన్నానపేట రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు ఆరోపించారు. ఆక్రమణలను తొలగించాలని తామే సూచించామని... ఆక్రమణదారులందరికీ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయకుండా కేవలం టీడీపీ సానుభూతిపరులకే నోటీసులు జారీ చేసి మిగిలిన వారిని వదిలిపెట్టారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు పోతల రాజప్పన్న తదితరులు ఉన్నారు.

లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వారిని శిక్షించాలి



రాజాం రూరల్: మాట్లాడుతున్న సురేష్‌బాబు

రాజాం రూరల్: శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి ఆలయ పవిత్రత, ప్రతిష్టను మంటగలిపేలా వ్యవహరించిన వారిని కఠినంగా శిక్షించాలని జనసేన ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పొగిరి సురేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో దుర్మార్గంగా వ్యవహరించిన ఆ పార్టీ నాయకులు, వారికి అంట కాగిన అధికారుల చర్యలతో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టకు భంగం వాటిల్లిందన్నారు. ఇందులో భాగంగా పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు అక్టోబరు రెండో తేదీ వరకూ నియోజకవర్గంలో ప్రాయశ్చిత్త దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు ప్రీతిపాత్రంగా భావించే లడ్డూలో జంతువుల కొవ్వు కలపడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు.ఈ విషయాలతోపాటు గత పాలకుల పాపాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కుప్పిలిశ్రీనివాసరావు, లెంక అన్నం నాయుడు, ఎన్‌వీ రమణ, శ్రావణ్‌కుమార్, డబ్బాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: తిరుపతి లడ్డూ కల్తీచేయడంపై సమగ్రమైన విచారణచేసి దోషులను శిక్షించాలని విజయనగరం పార్లమెంట్ టీడీపీ బీసీ అధికారప్రతినిధి ఎం.జగన్మోహనరావు కోరారు. సోమవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీయడమే వైసీపీ ప్రధాన ఎజెండాగా కనిపిస్తోందని ఆరోపించారు. దివ్యప్రసాదంగా భావించిన లడ్డూ కల్తీ చేయడం అత్యంత హేయమైన చర్య అని తెలిపారు.

హామీలు అమలు చేయాలని వినతి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మునాయుడు

బొబ్బిలి రూరల్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సామాజిక కార్యకర్త, జిల్లా రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం బొబ్బిలి ఆర్డీవోకు ఆయన వినతిపత్రం అందజేశారు. వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రెడ్డి సత్యంనాయుడు, చుక్క కూర్మినాయుడు, పెంకి సత్యంనాయుడు, ఎస్.అప్పారావు,శంకరరావు, ఎం.తిరుపతిరావు, వి.రవికుమార్, కునుకు వేణుగోపాలరావు, మరడ లక్ష్మణరావు, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.